క్లుప్తంగా

ఉర్దూ వర్సిటీ సమస్యల పరిష్కారానికి కృషి



ఉర్దూ యూనివర్సిటీ పరిసరాలను పరిశీలిస్తున్న ఏఎండీ ఇంతియాజ్

కర్నూలు (న్యూసిటీ) : డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ శాఖ కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్ అన్నారు. ఆయన శనివారం ఉర్దూ వర్సిటీని సందర్శించి సమస్యలను ఉపకులపతి ఆచార్య పి.ఫజులుర్ రహమాన్, రిజిస్ట్రార్ ఆచార్య బాయినేని శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఇంతియాజ్‌కు వీసీ, రిజిస్ట్రార్ పూల బొకే ఇచ్చి శాలువా కప్పి స్వాగతించారు. ఓర్వకల్లులోని డాక్టర్ అబ్దుల్ హక్ యూనివర్సిటీ శాశ్వత భవనాల నిర్మాణం, తాత్కాలిక వసతి కోసం ప్రభుత్వ భవనం కేటాయింపు, రెగ్యులర్ పోస్టులు, వర్సిటీ నిర్వహణ కోసం నిధులు మంజూరు తదితర విషయాలను ఉన్నత విద్యా శాఖ, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వీసీ కోరారు. కార్యక్రమంలో మైనార్టీ శాఖ డీడీ మస్తాన్ వలి, యూనివర్సిటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ కౌన్సిల్ హాలు శనివారం నిర్వహించిన వలంటీర్ పోస్టుల ఇంటర్వ్యూలు ప్రశాంతగా ముగిశా యి. 42 ఖాళీ పోస్టులకు 465 మంది అభ్య ర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో 239 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. సూపరింటెండెంట్లు పి. క్రిస్టఫర్, ఏ. స్వర్ణలత, కె. శ్రీదేవిలు ఇంటర్వ్యూలు నిర్వహించారు. నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ పర్యవేక్షించారు.

వేధింపుల కేసు నమోదు

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్‌లో వేధింపుల కేసు నమోదైనట్లు ఎస్‌ఐ నల్లప్ప తెలిపారు. లక్ష్మీపురం గ్రామానికి చెందిన జి.లాస్య అలియాస్ ముఖాంభికకు ఆత్మకూరు పట్టణానికి చెందిన లింగస్వామి అలియాస్ మందగిరి లింగమయ్యతో జూన్ 10, 2022న వివాహమైంది. వివాహ సమయంలో ఆరు తులాల బంగారు ఆభరణాలు, లక్ష రూపాయలు కట్న కానుకలు ఇచ్చారు. సంవత్సరం పాటు అన్యోన్యంగా కాపురం సాగింది. అయితే రెండు నెలల నుంచి అత్త రామ్ములమ్మ, మామ రామకృష్ణ, మరిది ఫణీంద్ర రూ.ఐదు లక్షలు అదనపు కట్నం తీసుకురావాలని, లేని పక్షంలో ఇంటి నుంచి వెళ్లిపోవాలని వేధించసాగారు. చాలా సార్లు కొట్టి ఇంటి నుంచి గెంటివేశారు. ఈ మేరకు శనివారం బాధితురాలి ఫిర్యాదుతో భర్త, అత్త, మామ, మరిదిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

సచివాలయ అడ్మిన్ కార్యదర్శుల బదిలీ

కర్నూలు (టౌన్): నగరపాలక పరిధిలోని వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న ముగ్గురు అడ్మిన్ కార్యదర్శులను నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ శనివారం బదిలీ చేశారు.షరాఫ్ బజార్ సచివాలయ అడ్మిన్ కార్యదర్శి బి. గేహ ప్రియాను మెరిడియన్ ఫంక్షన్ హాలు సచివాలయం, అక్కడ పనిచేసే అజయ్‌కుమార్‌ను షరాఫ్ బజార్ సచివాలయం, సీ. క్యాంపు క్వార్టర్స్ సచివాలయంలో పనిచేసే ఎస్. కె. హర్షిత్‌ను ఏపీ హెచ్‌బీ కాలనీ సచివాలయానికి బదిలీ చేశారు.

న్యాయవాదుల సమస్యలపై వినతి

కర్నూలు(లీగల్): కర్నూలు న్యాయవాదులు తమ సమస్యలపై హైకోర్టు జడ్జి కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం ఏపీ వక్ఫ్ ట్రిబ్యునల్ ప్రారంభోత్సవానికై విచ్చేసిన న్యాయమూర్తిని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శి చక్రపాణి, ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, ఎస్.లక్ష్మన్న, రవికుమార్, జాస్మిన్ తదితరులు కలిశారు.

పూర్వ విద్యార్థుల చేయూత



ఉపాధ్యాయులకు పుస్తకాలు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

కర్నూలు కల్చరల్: స్థానిక దామోదరం సంజీవయ్య నగర పాలక ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు (1986–87 బ్యాచ్ పదోతరగతి) తమ ఉదారత చాటుకున్నారు. శనివారం వారు పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థులతో ముచ్చటించారు. చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. తర్వాత తమ వంతుగా పాఠశాల లైబ్రరీకి రూ.10 వేలు విలువల గల పుస్తకాలు, డిక్షనరీ, స్పోకెన్ ఇంగ్లిష్, నీతి కథలు, అట్లాస్ తదితర పుస్తకాలు అందజేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని పూర్వ విద్యార్థి వి.రవికుమార్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, సుధీర్, పూర్వ విద్యార్థులు న్యాయవాది రమేష్, సులేమాన్, నరసింహ, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఇ'దండీ'మార్గం

ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా 1930 మార్చి 12న ఉప్పు సత్యాగ్రహం ప్రారంభమైంది. ఉప్పు పన్నును ధిక్కరిస్తూ నాడు జాతిపిత మహాత్మా గాంధీ నేతృత్వంలో సాగిన ఈ ఉద్యమంలో వేలమంది ఆయన వెంట నడిచారు. శాసనోల్లంఘన ఉద్యమంలో ఎక్కువ మంది పాల్గొనేందుకు స్ఫూర్తినిచ్చిన ఈ దండి మార్చ్‌ను గుర్తుచేసేలా నగరంలోని బిర్లా గడ్డ సర్కిల్‌లో స్థూపాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్థూపాన్ని ఈనెల 30న ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.

– సాక్షి, ఫొటోగ్రాఫర్, కర్నూలు



విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం

కర్నూలు(సెంట్రల్): దేశంలో విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు ఉధృతం చేయనున్నట్లు ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి అన్నారు. శనివారం ఎస్టీయూ భవన్‌లో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా మహాసభలు జరి గాయి.ముందుగా సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.శివారెడ్డి మాట్లాడుతూ..మోదీ అధికారంలోకి వచ్చాక అమలు చేసిన నూతన విద్యా విధానం ద్వారా ప్రాథ మిక పాఠశాలలు మూత పడి పేద , మధ్యతరగతి విద్యార్థులు విద్యకు దూరం కావాల్సి వస్తోందన్నారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శ్రీరాములుగౌడ, నాయకులు బాష, థామస్, శరత్‌కుమార్,రంగస్వామి,అల్తాఫ్ పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచేందుకు చర్యలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సెట్కూరు మేనేజర్ సత్యనారాయణ

కర్నూలు(హాస్పిటల్): విద్యార్థులు చదువు పూర్తయ్యాక ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందిస్తున్నట్లు సెట్కూరు మేనేజర్ సత్యనారాయణ చెప్పారు. సెట్కూరు–యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక కల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముజఫర్‌నగర్‌లోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస/కెరీర్ కౌన్సిలింగ్, ఉపాధి అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సెట్కూరు మేనేజర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థులు డిగ్రీ, ఇంజినీరింగ్ తదితర ఉన్నత చదువులు పూర్తి చేసుకుని బయటకు వస్తున్నా ఏఏ రంగాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయో వారికి తెలియడం లేదన్నారు.ఈ నేపథ్యంలో స్కిల్స్ పెంచుకోవడంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు డి.చిన్న హుసేన్, చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు, యువత వార్తా పత్రికలు చదవడం అలవరచుకోవాలన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు రాజశేఖర్ మాట్లాడుతూ చదువుకునే వయస్సు నుంచే విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరుచుకొని ఆ దిశగా అడుగులు వేయాలన్నారు. అనంతరం 10వ తరగతి తర్వాత ఉన్నత విద్యావకాశాలు, ఏఏ కళాశాలల్లో ఏఏ కోర్సులున్నాయి, అర్హత పరీక్షలు, జిల్లాలో ఉన్న శిక్షణా సంస్థల వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను విద్యార్థులకు అధికారులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి. ఉషారాణి, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హత్యా రాజకీయాలు కొత్తకోటకే చెల్లు



మాట్లాడుతున్న వైఎస్‌ఆర్‌సీపీ నేత శ్రీనివాసుల రెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): హత్యా రాజకీయాలు చేయడం మాజీ ఎమ్మెల్యే కొత్తకోట ప్రకాష్‌రెడ్డికే చెల్లుతాయని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసుల రెడ్డి అన్నారు. శనివారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మీ హత్యా రాజకీయాలకు ఎంత మంది బలయ్యారో గుర్తు లేదా అని కొత్తకోటను ప్రశ్నించారు. దేవదాయ భూములు ఆక్రమించుకున్న ఘనత కూడా మీ కుటుంబానికే దక్కిందన్నారు. కోట్ల హర్ష ఎక్కడైనా కమీషన్లు, వసూళ్లకు పాల్పడినట్లు ఆధారాలు ఉంటే నిరూపించాలన్నారు. . పార్టీ టికెట్లు పేరుతో ఎవరితోనూ ఆయన ఖర్చు పెట్టించడం లేదన్నారు. ఆశావహులు ఎందరున్నా పార్టీ అధిష్టానం సూచించిన అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తామని చెప్పారు. అనంతరం విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ మాట్లాడుతూ కొత్తకోట ప్రకాష్‌రెడ్డి వైఎస్‌ఆర్‌సీపీ నాయకులపై తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, నామనాథ్, హనుమంతు, బి. వెంకటేశ్వర్లు, ఎల్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలోనే సంతృప్తి



మదర్ థెరిస్సా విగ్రహం వద్ద మేయర్, కార్పొరేటర్లు

కర్నూలు (టౌన్) : సమాజానికి సేవలు అందించడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుందని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. శనివారం స్థానిక చిరంజీవి పార్కు వద్ద న్యూ పవర్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి కేక్ కట్ చేశారు. మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని కేజీ రెడ్డి కార్యాలయంలో కేజీ రెడ్డి ఫౌండేషన్, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో 100 మంది రక్తదానం చేశారు. సోమిశెట్టినగర్‌లో మరియాదాస్ హోమ్‌లో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో వైఎస్‌ఆర్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ గాజుల శ్వేతారెడ్డి, పార్టీ నగర అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, కార్పొరేటర్లు క్రిష్ణకాంత్ రెడ్డి రామక్రిష్ణ, విద్యాసాగర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు సిటీ: స్థానిక బీ క్యాంపులోని ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలో మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ మాట్లాడుతూ మదర్‌థెరిస్సా సేవలను గుర్తుచేశారు. కార్యక్రమంలో కాలేజీ అధ్యాపకులు వైవీ రామకృష్ణ, సోమేష్, జబీన్ అక్తర్, సుజాత, లక్ష్మీ, శ్రావణి, లావణ్య, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులను ఆకర్షించేందుకు ఆప్కో కొత్త పథకాలు

కర్నూలు(అగ్రికల్చర్): చేనేత వస్త్రాల అమ్మకాలను గణనీయంగా పెంచేందుకు, వినియోగదారులను ఆకట్టుకునేందుకు ఆప్కో కొత్త స్కీమ్‌లు అమలు చేస్తున్నట్లు ఆసంస్థ డివిజనల్ మేనేజర్ భారతి శనివారం విలేకరులకు తెలిపారు. ప్రతి నెల రూ.500 నుంచి అపై ఎంతైనా 11 నెలల పాటు ఆప్కోకు చెల్లిస్తే 12వ నెల నెలకు చెల్లించే మొత్తాన్ని కలిపి 30 శాతం డిస్కౌంట్‌పై చేనేత వస్త్రాలు ఇస్తామన్నారు. ఉదాహరణకు నెలకు రూ.1000 ప్రకారం 11 నెలలు చెల్లిస్తే రూ.11వేలు అవుతుందని, 12వ నెల ఆప్కో రూ.1000 కలిపి రూ.12వేలకు కోరుకున్న చేనేత వస్త్రాలను 30 శాతం రాయితీతో ఇస్తుందన్నారు. అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగులకు గవర్నమెంటు ఎంప్లాయిస్ సేవింగ్ స్కీమ్‌ను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద రూ.25వేల నుంచి రూ.50 వేల వరకు అప్పుపై 30 శాతం రాయితీలో చేనేత వస్త్రాలు విక్రయించనున్నామని పేర్కొన్నారు. గెజిటెడ్ అధికారులకు రూ.50 వేలు, నాన్ గెజిటెడ్ అధికారులకు రూ.25 వేల వరకు చేనేత వస్త్రాలు అప్పుపై ఇవ్వనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 90005 51568 నెంబరుకు పోన్ చేయాలని సూచించారు.

సినీ రంగానికి మూలం నాటకం



డీఎస్ దీక్షిత్ స్మారక పురస్కారాన్ని నటుడు కృష్ణేశ్వరరావుకు అందజేస్తున్న అతిథులు



త్రిజుడు నాటకంలో ఓ సన్నివేశం

కర్నూలు కల్చరల్: సినీ రంగానికి మూలం నాటక రంగమని రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, విశ్రాంత ఐఏఎస్ బలరామయ్య, ప్రజా నాట్య మండలి వేదిక కన్వీనర్ డాక్టర్ శాంతారామ్ అన్నారు. కళావిపంచి, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో సీక్యాంప్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో రెండో రోజు శనివారం సాంఘిక నాటకాల ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయలసీమలో సాంఘిక నాటక రంగం వెనకబడి ఉందన్నారు. అందుకే సినీ రంగంలో రాయలసీమ కళాకారుల సంఖ్య చాలా తక్కువగా ఉందన్నారు. కళలను, కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ త్వరలో ఒక అకాడమి ఏర్పాటు చేసి యువతకు నటనలో శిక్షణ ఇచ్చేలా కృషి చేస్తామన్నారు. అనంతరం డీఎస్ దీక్షిత్ స్మారక పురస్కారాన్ని పొన్నూరుకు చెందిన ప్రముఖ నాటక, సినీ రచయిత, నటుడు ఎస్.కృష్ణేశ్వరరావుకు అతిథులు అందజేశారు. అనంతరం ప్రదర్శించిన పొన్నూరు రసఝరి వారి 'త్రిజుడు', కత్రపాడు ఉషోదయ కళా నికేతన్ వారి 'ప్రక్షాళన' నాటకాలు అలరించాయి. కార్యక్రమంలో కళావిపంచి అధ్యక్షులు బొప్పన నరసింహరావు, ముఖ్య సలహాదారులు డి. రామకోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.జి. శంకర్, కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కోశాధికారి లక్ష్మీకాంతరావు, సభ్యులు సంగా ఆంజనేయులు, క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

ఈ రోజు

టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి

కర్నూలు కల్చరల్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు 151వ జయంతి ఉత్సవాలను ఆదివారం కర్నూలు నగరంలోని డిగ్రీ కళాశాలల్లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గాడిచెర్ల ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర పేర్కొన్నారు. సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కళాశాలలో ఉదయం 10 గంటలకు మొదటి సెషన్, కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మధ్యాహ్నం 3 గంటలకు రెండో సెషన్ జరుగుతుందని తెలిపారు.

జిల్లా మాతృశక్తి సమ్మేళనం

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్ జిల్లా మాతృ శక్తి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10.30 గంటలకు స్థానిక భరత మాత ఆలయ ప్రాంగణంలో 'మాతృశక్తి సమ్మేళనం' నిర్వహిస్తున్నట్లు మాతృశక్తి జిల్లా కన్వీనర్ జంపాల రాధిక పేర్కొన్నారు. హిందు మహిళలు, వివిధ ధార్మిక సంఘాల మహిళా కార్యకర్తలు సమ్మేళనంలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలోని గణేష్ నగర్ ఏరియాలో చేపడుతున్న అభివృద్ధి పనుల కారణంగా ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు టౌన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక గణేష్ నగర్, సాయి విజయ్ కాలనీ, రెవెన్యూ కాలనీ, ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీ, పార్థసారథి టవర్స్, శ్రీవారి కుటీర్, రామ్ నగర్, జొహరాపురం రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అయితే ప్రత్యామ్నాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు చేపడుతామని, సాధ్యపడని పక్షంలో ఈ అసౌకర్యాన్ని సహకరించాలని కోరారు.

ఇస్కాన్‌లో ఝులన్ యాత్ర

కర్నూలు కల్చరల్: స్థానిక ఇస్కాన్ జగన్నాథ మందిరంలో ఆదివారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు శ్రీ రాధా గోవిందుల ఝులన్ యాత్ర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సంక్షిప్తం

న్యాయవాది జయన్న మృతిపై సంతాపం

కర్నూలు(లీగల్) : న్యాయశాఖ విశ్రాంత ఉద్యోగి, న్యాయవాది ఎస్.జయన్న(70) మృతి పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగభూషణం నాయుడు, చక్రపాణి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు పి.రవిగువేరా, సీనియర్, జూనియర్ న్యాయవాదులు సంతాపంవ్యక్తం చేశారు. జయన్న ఇటీవల అనారోగ్యానికి గురై ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

11మంది స్వీపర్లను విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్) : కర్నూలు ఆర్టీసీ బస్టాండ్‌లో తొలగించిన 11 మంది స్వీపర్లను విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ కర్నూలు న్యూసిటీ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ సాయిబాబా, ఆర్.నరసింహులు కోరారు. శనివారం వారు కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.

తొలగించిన వారికి ఉద్యోగాలు ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్) : కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో తొలగించిన 107మందికి క్యాన్సర్ విభాగంలో మంజూరైన పోస్టులను కేటాయించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శనివారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, జయరాంరెడ్డి, రేణుక పాల్గొన్నారు.

నాపరాయి లారీల పట్టివేత

కర్నూలు (న్యూసిటీ) : అక్రమంగా నాపరాయి తరలిస్తున్న ఐదు లారీలను శుక్రవారం రాత్రి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. బేతంచెర్ల నుంచి కర్నూలు వైపు వస్తున్నట్లు సమాచారం అందడంతో నగర శివారులో వారు తనిఖీలు చేపట్టారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసి మైనింగ్ అధికారులు అప్పగించారు. ఈ విషయాన్ని మైనింగ్ డీడీ రాజశేఖర్ శనివారం తెలిపారు. పట్టుబడిన లారీలకు రూ.5 లక్షలు జరిమానా విధించామని వెల్లడించారు.

గార్గేయపురం అభివృద్ధికి పాటుపడతాం



మంచినీటి బోరును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): గార్గేయపురం గ్రామ అభివృద్ధికి పాటుపడతామని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం ఆ గ్రామంలో రూ.10లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ముందుగా సీఎస్ఐ చర్చి ఫాదర్ ఇమ్మానియేలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం టెంకాయ కొట్టి సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆ తర్వాత సీఎస్ఐ చర్చిలో ఎమ్మెల్యే సుధాకర్, కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్‌ను సీఎస్ఐ సంఘ సభ్యులు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు. ఆ తరువాత పీహెచ్‌సీ ఎదురుగా నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డుకు భూమిపూజ చేశారు. అనంతరం గ్రామంలో నూతనంగా వేసిన మంచి నీటి బోరును ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. మాట్లాడుతూ కోడుమూరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి పాటుపడతానన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తేనె జ్యోతిలత, సొసైటీ చైర్మన్ వినయ్‌కుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ కౌశిక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఏసేపు, వైస్ ఎంపీపీ2 నెహెమ్యా, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, ఉప సర్పంచ్ మల్లశివుడు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



మహిళలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి పరచాలన్నదే వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. శనివారం రాత్రి ఆయన 52వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎస్.నాగప్ప వీధిలో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తర్వాత వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం మాట్లాడుతూ పేదల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సర్దార్, మహేష్, రమణ, ఇబ్రు, మునిస్వామి, సుబ్బు, చిన్ని, సిద్ధయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీటీడీ పాలక మండలిలో సామాజిక న్యాయం

● గిరిజనులకు అవకాశం కల్పించడంపై వైఎస్ జగన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తున్న టీఎస్ఎఫ్ నేతలు

కర్నూలు(అర్బన్): తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యుల నియామకాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటించారని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ చంద్రప్ప అన్నారు. పాలక మండలిలో గిరిజనులకు అవకాశం కల్పించడం టీటీడీ చరిత్రలో ఇదే మొదటి సారన్నారు. ఈ నేపథ్యంలో టీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఉప ముఖ్యమంత్రి పిడికి రాజన్న దొర ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. అనంతరం స్థానిక బిర్లాగేట్ సర్కిల్‌లో పూలే విగ్రహం వద్ద వారు స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా చంద్రప్ప మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా టీటీడీ పాలక మండలిలో గిరిజనులకు అవకాశం కల్పించాలని కోరుతున్నా, పాలక ప్రభుత్వాలు ఏవీ పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరమే నామినేటెడ్ పదవుల్లో గిరిజనులకు సామాజిక న్యాయం చేశారన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ నాయకులు గౌతమ్, విద్యార్థి నాయకులు మధుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్

బాక్సింగ్ పోటీలు ప్రారంభం



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్) : జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అంతర్ పాఠశాలల బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను నగర మేయర్ బీవై రామయ్య ప్రారంభించి మాట్లాడారు. ఒత్తిడి నుంచి ఉపశమనం పొందాలంటే విద్యార్థినీ, విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరమన్నారు. ప్రభుత్వం క్రీడా రంగానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు ఫయాజ్ అహమ్మద్, కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ సీఈఓ రమణ, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు,క్రీడాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడల నిర్వహణకు సహకారం

కర్నూలు (టౌన్): క్రీడల నిర్వహణకు తన వంతు సహకారం అందిస్తానని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కేజీ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్ పాఠశాలల హాకీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, హాకీ అసోసియేషన్ కార్యదర్శి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

30 న జంప్ రోప్ పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 30 వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ (మహిళలు, పురుషులు) విభాగాల్లో జిల్లా స్థాయి జంప్‌రోప్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జంప్ రోప్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి. ఏసేపు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనబరచి ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 8,9 తేదీల్లో గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి జంప్‌రోప్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

నెలాఖరులోగా ఉద్యోగుల ఈ-కేవైసీ పూర్తి చేయాలి



సబ్ ట్రెజరీ అధికారులతో సమావేశమైన జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు

కర్నూలు(అగ్రికల్చర్):ఈ నెల చివరి లోపు ప్రభుత్వం నుంచి వేతనం పొందుతున్న అన్ని కేటగిరీ ఉద్యోగుల ఈ–కేవైసీ 100 శాతం పూర్తి చేయాలని జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు సబ్ ట్రెజరీ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో జిల్లాలోని సబ్ ట్రెజరీ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఈ–కేవైసీతో పాటు వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఏటీఓ జయలక్ష్మి, ఎస్టాబ్లిస్‌మెంటు ఎస్‌టీఓ పలనాటి సునీల్ తదితరులు పాల్గొన్నారు.